ఖమ్మం ఆస్పత్రికి వెళ్లండి!

- ఇల్లెందు వైద్యశాలలో ప్రథమ చికిత్సకే పరిమితమా..?
- ప్రతీదానికి ఖమ్మానికి రిఫర్
- 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ - సదుపాయాలు డీ గ్రేడ్


ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి

ఇల్లెందు: అత్యసవర వైద్యం అందనంత దూరం వెళ్లింది. ఏదైనా ప్రమాదవశాత్తు ఆస్పత్రికి వచ్చిన రోగులను చీటికి మాటికి ఖమ్మం రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. సరైన వైద్యం అందించాలంటే తగిన సదుపాయాలు లేకపోవటమే కారణం అని ఆస్పత్రి వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయి రెండేళ్లు అయింది. సదుపాయాలు మాత్రం డీ గ్రేడ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం ఆఘమేఘాల మీద అప్‌గ్రేడ్ చేసినా అందుకు తగిన విధంగా సదుపాయాలు కల్పించలేదు. దీంతో అరకొర వైద్యమే అందుతోంది.

ఐసీయూ లేక..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఐసీయూ లేదు. 2022 జనవరిలో ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేశారు. ఐసీయూ కోసం కేటాయించిన గదిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రమాదకర పరిస్థితుల్లో వచ్చిన రోగిని ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తారు. ఈ సౌకర్యం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో లేదు. దీనివల్ల రోగులను ఖమ్మంకు రిఫర్ చేస్తున్నారు. ఇక ఒకే ఒక్క ఆపరేషన్ థియేటర్ ఉంది. ప్రస్తుతం ఇందులోనే ప్రసూతి, ఇతర శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

అందుబాటులో లేని పరికరాలు...

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో పలువురు ప్రత్యేక వైద్య నిపుణులు ఉన్నారు. వీరంతా సరైన వైద్యం అందించాలంటే అందుకు తగిన సదుపాయాలు ముఖ్యంగా పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ముఖ్యంగా సీఏఆర్ఎం -1, డ్రిల్లింగ్ యంత్రం -1, డెంటల్ చైర్-1, స్లిప్ ల్యాంప్-1, ఏఆర్ మిషన్-1, మైక్రోస్కోప్-1, ల్యాప్రోస్కోపిక్-1 లేవు. ఈ పరికరాలు అందుబాటులో ఉంచాలి.

ఎవరికీ పట్టింపు లేదు..

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల అప్‌గ్రేడ్ అయి రెండేళ్లు అయినా నేటికీ క్యాడర్ స్ట్రెంత్ అడ్రస్ లేకుండా పోయింది. ఈ వైద్యశాల పట్ల ఎవరికీ పట్టింపు లేదు. గత ప్రభుత్వంలో జరిగినట్లు వేగంగా ఈ ప్రభుత్వంలో ఏ సమస్యకూ కూడా పరిష్కారం లభించటం లేదంటున్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 61 సీహెచ్‌సీలను వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌కు బదలాయించారు. ఈ మార్పు జరిగిన తర్వాత వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. రోగుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఈ జాబితాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, బూర్గంపాడు సీహెచ్‌సీలకు చోటు దక్కింది. ప్రస్తుతం 12 మంది వైద్యులు సేవలు అందిస్తున్నారు. 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయి క్యాడర్ స్ట్రెంత్ వస్తే సుమారు 30 మంది వైద్యులు, 60 మంది నర్సులు, 40 మంది ఇతర సిబ్బంది పని చేసే అవకాశం ఉంటుంది. ఆస్పత్రి అప్‌గ్రేడ్ చేయటం వల్ల ఆస్పత్రి రూపురేఖలు మారిపోయి, స్పెషలిస్ట్ వైద్యులు, సిబ్బంది నియామకం అవుతారు. పాము, తేలు, కుక్కకాటు, పురుగు మందు సేవించిన వారి అత్యవసర వైద్యం ఇక్కడే అందుతుంది. ఈ దిశగా ప్రభుత్వం, అధికారులు ఆలోచన చేయడం లేదు.

బ్లడ్ బ్యాంక్ ఏది..?

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో శస్త్రచికిత్సలు కూడా జరుగుతున్నాయి. దీనికి అనుగుణంగా బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులో ఉండాలి. ఇందుకోసం నూతనంగా ఏర్పాటు చేయాలని తలంచినా అందుబాటులోకి రాలేదు. ఏ రోగికైనా అత్యవసరంగా రక్తం అవసరం అయితే అందుబాటులో ఉండాలి. కానీ బ్లడ్ బ్యాంక్ ఇక్కడి నుంచి పాల్వంచకు మారింది. ఇక్కడ మళ్లీ ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి.


ఫిట్స్‌తో వచ్చిన వ్యక్తిని రిఫర్ చేసిన వైద్యులు

100 పడకల ఆస్పత్రిగా మార్చండి..



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల ఆస్పత్రిగా మార్చాలి. అప్పుడే అన్నిరకాల జబ్బులకు వైద్యం అందుతుంది. రెండేళ్ల క్రితం అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జీఓ కూడా విడుదల అయింది. కానీ ఏం జరిగిందో ఏమో అమలుకు నోచుకోవడంల లేదు. రోగుల జేబులు గుల్ల కాకుండా ఇక్కడే అత్యవసర వైద్యంతో సహా అన్నిరకాల వైద్యసేవలు అందించాలి.

– హరిప్రసాద్ యాదవ్, ఇల్లెందు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..



సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రునికి వైద్యం అందించాలంటే ఐసీయూ లేదు. అంతేకాకుండా ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, జనరల్, ప్రత్యేక వార్డులు అవసరం అవుతుంది. తగిన సదుపాయాలు లేవు. అందుకే రిఫర్ చేయాల్సి వస్తోంది.

– డాక్టర్ హర్షవర్ధన్, సూపరింటెండెంట్, ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి

క్లుప్తంగా

గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయండి..


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: నవంబర్ 5న ఖమ్మంలో జరగనున్న గిరిజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు బానోత్ మధు, బానోత్ ఇస్రా పిలుపునిచ్చారు. గిరిజన సంఘం వ్యవస్థాపకుడు గుగులోత్ ధర్మా నాయక్ వర్ధంతి సందర్భంగా జరగనున్న సమ్మేళనం కరపత్రాలను ఆదివారం కొమ్ముగూడెంలో నాయకులు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. వామపక్ష ఉద్యమానికి ఆకర్షితులైన నాటి నుంచి తుదిశ్వాస వరకు ధర్మా నాయక్ ప్రజాఉద్యమాలు నిర్వహించారన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాలు, గిరిజన, పోడు భూముల సమస్యలపై పోరాటం చేశారని, ఖమ్మం బంజారా భవన్ నిర్మాణంలో ధర్మా నాయక్ కీలక భూమిక పోషించినట్లు చెప్పారు. గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లకావత్ శ్రీను, బానోత్ రూప, భూక్యా బిచ్చు, బానోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మసీద్ కాంప్లెక్స్ ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న ఇర్ఫాన్, ఫాతిమా

పాల్వంచ: మసీద్ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపును బలవంతంగా ఖాళీ చేయించి తమ జీవనోపాధిని దెబ్బతీశారని ఎస్‌డి.ఇర్ఫాన్, ఫాతిమా ఆరోపించారు. ఆదివారం మసీద్ కమిటీ ఖాళీ చేయించిన షాపు ఎదుట మసీద్ కమిటీ దౌర్జన్యం నశించాలని ప్లకార్డులతో వారు బైఠాయించారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ... మసీద్ కాంప్లెక్స్‌లో దస్తగిరి డిజిటల్ ఎలక్ట్రానిక్స్ షాపును తొమ్మిదేళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు కారణంగా అద్దెను చెల్లించలేదని, ఈ విషయంపై కమిటీ పెద్దలను కలిసి నెలరోజుల గడువు ఇవ్వాలని వేడుకున్నామని, అయినా షాపు తాళాలు పగులగొట్టి వేరే తాళాలు వేశారని వాపోయారు. ఈ విషయమై మసీద్ కమిటీ అధ్యక్షుడు ఫయాజుల్ హుస్సేన్‌ను వివరణ కోరగా.. కమిటీ నిర్ణయం మేరకు ఖాళీ చేయించామని, వాస్తవానికి దస్తగిరి పేరున షాపు ఉందని, అతను మృతి చెందగా భార్య ఫాతిమాకు మానవతా దృక్పథంతో ఇచ్చామని, ఆమెకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

కొడుకు, బిడ్డలున్నా.. అనాథలుగా తల్లిదండ్రులు


నిత్యావసరాలు అందజేస్తున్న సీతారామయ్య

పాల్వంచరూరల్: కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నా.. తల్లిదండ్రులు మాత్రం అనాథలుగా జీవనం సాగిస్తున్నారు. బంద్రుగొండ గ్రామానికి చెందిన పత్తిపాటి సత్యం, మాణిక్యమ్మ దంపతులకు కుమారుడు బాబు, కొడలు మంగమ్మ, కుమార్తెలు చిట్టమ్మ, ఉమ ఉన్నారు. వారికి వివాహాలు చేసిన తర్వాత తల్లిదండ్రులను వదిలేసి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. ప్రస్తుతం వృద్ధ దంపతుల్లో తండ్రి పక్షవాతంతో నడవలేకుండా ఉన్నాడు. తల్లి కూడా నడవలేని పరిస్థితిలో ఉంది. ఈ పరిస్థితిలో వీరి బాగోగులు చూసే వారు లేక ఇబ్బందులు పడుతున్నారు. సత్యంకు వచ్చే పింఛన్‌తోనే జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వీరి అవస్థలు చూడలేక గ్రామానికి చెందిన కంటే సీతారామయ్య నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఇప్పటికైనా వృద్ధ దంపతుల బాగోగులను కన్నబిడ్డలు చూసుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు భరోసాకు ఎగనామం..


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఎన్నికల ముందు అమలు కానీ హామీలు ఇచ్చి అధికారం చేపట్టి వాటిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు ఎగనామం పెట్టడాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ సెంటర్‌లో దహనం చేశారు. మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతు భరోసా ఇవ్వలేమని సాక్షాత్తు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడం వారి చేతకానితనానికి నిదర్శనం అన్నారు. ముమ్మాటికి ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం అన్నారు. పాలన చేతకాక ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయలేక చేతులు ఎత్తేసిన కాంగ్రెస్‌కు ప్రజలే చరమ గీతం పాడతారని పేర్కొన్నారు. లాకావత్ దేవీలాల్ నాయక్, సిలివేరు సత్యనారాయణ, జేకే శ్రీను, భాస్సింగ్ నాయక్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రమోద్ కుమార్, అబ్దుల్ నబీ, జబ్బార్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి జిల్లాలోని అర్హులైన యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు స్కాలర్‌షిప్ ముందుగా రూ.6000, అనంతరం ప్రతీనెల రూ.5000 కేంద్రం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ పాలిటెక్నిక్ డిప్లొమా, బీకామ్, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీ చదివిన 21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి సంవత్సర ఆదాయం రూ.8లక్షల లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న అఖిల్ అహ్మద్

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామానికి చెందిన మంచె సత్యనారాయణ అనారోగ్యంతో ఏడాది క్రితం మృతి చెందాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి పైచదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పోచారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ అఖిల్ అహ్మద్ సత్యనారాయణ పెద్ద కుమార్తె అరణ్య చదువు కోసం రూ.50వేలు నగదును ఆదివారం అందజేశారు.

కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు


జూలూరుపాడు: మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

సుజాతనగర్: ఇందిరమ్మ కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవాపురంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ శాఖా సభల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని చెప్పి కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు. అర్హులకు ఇంటి స్థలం ఉంటే రూ.10 లక్షలు ఇవ్వాలని, స్థలం లేని వారికి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. రుణమాఫీ కాని రైతులకు ఆధార్, రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పేద మహిళలకు ఇస్తానని చెప్పిన రూ.2500 హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వీర్ల రమేష్, నాయకులు కాట్రాల తిరుపతిరావు, మురిపుటి రాములు, మద్దెబోయిన గోవర్ధన్, రాములు, చీపు వెంకన్న, మురిపుటి నగేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా 'ఇందిరమ్మ'కమిటీలు

జూలూరుపాడు: ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను ఏర్పాటు చేయడం సరైంది కాదని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో గిరిజనేతరులకు అవకాశం కల్పించరాదన్నారు. అర్హులైన పేదలకు ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడు భూక్యా చరణ్ నాయక్, ప్రసాద్, వెంకటేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు జేకే ఓసీ దుర్గామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మహాచండీ యాగం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఆదివారం ఇల్లెందులోని జేకే ఓసీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణ మోహన్ మాట్లాడుతూ... ఈ నెల 16 నుంచి 20 వరకు చండీయాగం నిర్వహించినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (ఎంపీ)మల్లెల సుబ్బారావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రామస్వామి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, మేనేజర్ పూర్ణచందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఉద్యోగుల సహబంక్తి భోజనాలు చేశారు. గని సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, ప్రాజెక్ట్ ఇంజనీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్, సెక్యూరిటీ అధికారి మహేష్, గుర్తింపు సంఘం నాయకులు సారయ్య, ప్రాతినిధ్య సంఘం ప్రతినిధి జే.వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి సంజీవచారీ, పడిదల నవీన్ పాల్గొన్నారు.

25 నుంచి సర్టిఫికెట్ల తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ జూలై 20, 21 తేదీలలో 10 విభాగాలకు చెందిన ఉద్యోగులకు నిర్వహించిన పరీక్ష ఫలితాలు గతనెలలో విడుదల చేసింది. వాటిలో ఎంపికయిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి 29 వరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనుంది.

వీటిలో ఈనెల 24, 25 తేదీలలో మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్) ఈ-2 గ్రేడ్, 26న మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్అండ్‌ఏ) ఈ-2 గ్రేడ్, మేనేజ్‌మెంట్ ట్రైనీ పర్సనల్ ఈ-2 గ్రేడ్, 28న మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఈ-2 గ్రేడ్, సివిల్ సబ్ ఓవర్‌సీస్ (టీఎస్ గ్రేడ్ సీ), మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఐఈ) ఈ-2 గ్రేడ్, ఈనెల 29న జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ఈ-3 గ్రేడ్, మేనేజ్‌మెంట్ ట్రైనీ (హైడ్రోజియాలజిస్ట్) ఈ- 2, జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ-1 గ్రేడ్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్- గ్రేడ్-1, ఇంటర్వ్యూలకు వచ్చే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు రిక్రూట్‌మెంట్ సెల్‌కు హాజరు కావాలని యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

హిందువులు ఐక్యంగా ఉండాలి


జూలూరుపాడులో రూట్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సేవకులు


మాట్లాడుతున్న విభాగ్ ప్రచారక్ మధు

జూలూరుపాడు: హిందువులు ఐక్యంగా ఉండాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విభాగ్ ప్రచారక్ మధు అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జూలూరుపాడులో సేవకులు భారీ రూట్ మార్చ్ (ఖండ పథ సంచలన్) నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఆర్ఎస్ఎస్ సేవకులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవసరమైతే ఎటువంటి గుర్తింపు లేకుండా శాయశక్తులా పనిచేసి దేశ అఖండతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ గ్రామీణ వైద్యుడు పూసాల శ్రీనివాసాచారి, ఆర్ఎస్ సేవకులు శ్రీనాథరాజు శ్రీనివాసరాజు, చొప్పకట్ల చంద్రశేఖర్‌శర్మ, చిలుకూరి రమేష్, కొండెం శివాజీ, అమర్నాథ్ నాగరాజు, మహంకాళి గోపాలకృష్ణ, నల్లమోతు నరసింహారావు, సోడె శ్రీరామ్, ఇరప రామారావు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి కార్పొరేట్ మెడికల్ బోర్డ్


సింగరేణి మెయిన్ ఆస్పత్రి ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈనెల 24, 25వ తేదీలలో కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. సింగరేణి సంస్థలో కొంతకాలం పనిచేసి మిగులు రెండు సంవత్సరాలు సర్వీసు ఉన్న వారిని మెడికల్ బోర్డ్‌కు పంపించి, వారి ఆరోగ్యాన్ని పరీక్షించనున్నారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయితే వారి స్థానంలో వారి వారసులకు సంస్థలో ఉద్యోగం అవకాశం కల్పించేందుకు గాను యాజమాన్యం రెండు రోజులు మెడికల్ బోర్డ్ నిర్వహించనుంది. అయితే మొదటి రోజు కార్మికుడి వైద్య పరీక్షలు నిర్వహించి, ఫలితాన్ని బట్టి రెండోరోజు ఈనెల 25న హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్య నిపుణుల ద్వారా మెడికల్ ఇన్‌వాలిడేషన్ ఫలితాలు విడుదల చేస్తారు. ఈ ఫలితాల్లో ఇన్‌వాడేషన్ అయిన వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. మిగతా వారు యథావిధిగా విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పక్రియ పారదర్శకంగా జరగడానికి, దళారీ వ్యవస్థకు చెక్ పెట్టడానికి సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నిఘాను పటిష్టం చేశారు. మెడికల్ బోర్డ్‌కు వెళ్లే అభ్యర్థులకు ఫోన్ చేసి, తాము అన్‌ఫిట్ చేస్తామని చెబితే ఆయా వివవరాలను 9491144104 నంబర్‌కు వాట్సప్ చేయమని తెలిపారు. అయినప్పటికీ గత మెడికల్ బోర్డ్‌లో 80శాతం మంది మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయినట్లు సమాచారం. అయితే ఈ అన్‌ఫిట్ అయిన వారు నిజంగా అయ్యారో లేదంటే పైరవీల ద్వారా అయ్యారో నిర్ధారించాల్సిన బాధ్యత యాజమాన్యంపై, యూనియన్ నాయకులపై ఉంది. అంతేకాకుండా అన్‌పిట్ అయిన వారి వివరాలతో పాటు, వారు ఏ జబ్బుతో అన్‌పిట్ అయ్యారో అనే అంశాన్ని ప్రధాన కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో డిస్‌ప్లే చేయాలని కార్మికులు, మరికొన్ని కార్మిక సంఘాలు కోరినప్పటికీ సింగరేణి యాజమాన్యం వీరి అభ్యర్థనను పక్కన పెట్టిన్నట్లు సమాచారం. మెడికల్ బోర్డ్ నిర్వహించే తేదీ ఆస్పత్రిలో, కార్పొరేట్ కార్యాలయంలో అనుసంధామైన శాఖల ఉన్నతాధికారులకు రానీ సమాచారం దళారులకు వారంరోజుల ముందుగానే వెళ్లటమే కాకుండా, వారికి ఉన్న జబ్బుల వివరాలు కూడా దళారులకు వెళ్తున్న విషయాన్ని యాజమాన్యం అరికట్టలేక పోతోందనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా ఆయా గనుల్లో కొంత మంది లీడర్లు, వెల్ఫేర్ విభాగం సిబ్బంది కూడా బాధితులకు ఫోన్ చేసి అన్‌ఫిట్ చేయిస్తామని, మీరు కలిస్తేనే అన్‌ఫిట్ అవుతారు.. లేకుంటే అన్‌ఫిట్ కారని తేల్చిచెప్పటంతో అభ్యర్థులు దళారులను ఆశ్రయించే పరిస్థితి ఉంది.

ప్రకటనలకే పరిమితమైన ఆదేశాలు..

మెడికల్ బోర్డ్ విషయంలో అధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని, దీనిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపించిందనే కార్మికులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు మెడికల్ బోర్డ్‌కు వెళ్లే అభ్యర్థుల వివరాలు కేవలం ఆయా గనుల మేనేజర్లకు మాత్రమే వెళ్లాల్సి ఉంది. కానీ వారికంటే ముందే దళారులకు వెళ్లటమే కాకుండా వారికి సంబంధించిన పూర్తి వివరాలు దళారులకు వెళ్తున్నాయని, దీనిపై సీరియస్ యాక్షన్ ఉంటుందని సంస్థ ఉన్నతాధికారులు ప్రకటించి ఆరుమాసాలైన ఎటువంటి చర్యలు లేవని విమర్శలు ఉన్నాయి.

పూర్వ విద్యార్థుల రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం


1985 - 86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు


రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచ: బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదోతరగతి చదివిన విద్యార్థులు పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 105 మంది నాటి విద్యార్థులు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కొల్లి కలన చేతుల మీదుగా గీత అనే దివ్యాంగ స్నేహితురాలికి ట్రై సైకిల్, రూ.లక్ష నగదును అందించారు. కార్యక్రమంలో సాయికృష్ణ, కర్నాటి సర్వేష్, హనుమంతరావు, విజయ్ కుమార్, వాణి, హరినాథ్, రంగారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో సందడి...

స్థానిక లారీ అసోసియేషన్ ఫంక్షన్ హాల్‌లో నవభారత్ కర్మాగారం రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. స్నేహానికి ఉన్న ప్రాముఖ్యాన్ని చాటుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సన్మానించుకున్నారు. కార్యక్రమంలో వై.సుబ్బారావు, పీవీ.సుబ్బారావు, టీఎస్ఎన్ రెడ్డి, సమ్మయ్య, ఎన్‌వీ చారి, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అట్లతద్ది వేడుకలు


ఊయల ఊగుతున్న మహిళలు


అట్లతద్ది సందడి చేస్తున్న మహిళలు

టేకులపల్లి: పెళ్లి కాని యువతులు మంచి భర్త కోసం, వివాహిత మహిళలు భర్త ఆరోగ్యం, ఆయుష్షు కోసం జరుపుకునే అట్లతద్ది వేడుకలు ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు రోజంతా ఉపవాసం ఉండి సాయంత్రం అట్లు తిని ఉపవాసాన్ని విరమించారు. గౌరీదేవి పూజ చేసి, ముత్తయిదులకు వాయినాలు ఇచ్చారు. చేతులకు పూల తోరణాలు కట్టుకుని ఊయల ఊగి ఆటపాటలతో సందడి చేశారు.